కడప-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

సోమవారం 26 అక్టోబర్ 2026


# వరి పంటపై వరుణుడి దెబ్బ



వర్షానికి దెబ్బతిన్న వరి పంట

సుండుపల్లె,అక్టోబర్ 25,ప్రభాతవార్త : ఈదరగాలులు వర్షానికి వరి పంట పూర్తిగా నేలకొరిగినట్లు రైతు కృష్ణ నాయక్ తెలిపారు. మండలంలోని మాచి రెడ్డి గారి పల్లి గ్రామపం చాయతీ మిట్టబిడికిలో కృష్ణనాయకు చెందిన రెండు ఎకరాల వరి పంట ఈదరగలు వర్షానికి పూర్తిగా నేలకు ఒరిగింది. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట చేతికందే సమయంలో ప్రకృతి కన్నెర్ర చేయడంతో రైతు ఆశలు నేల మట్టమయ్యాయి. ఈదురుగాలులు, వర్షం ధాటికి వరి పంట పూర్తిగా నేలకొరగడంతో రైతు కృష్ణా నాయక్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా ఆ ప్రాంతంలో మరి కొంతమంది రైతుల పొలాలు నష్టం వాటిని రైతులు తెలిపారు. దీంతో పంట దెబ్బతిని దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే పరిస్థితి ఏర్పడింది. ఎంతో శ్రమించి సాగు చేసిన పంట కళ్లముందే నేలకొరగడంతో రైతు ఆవేదన చెందుతున్నారు. ప్రకృతి వైపరీత్యంతో నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని, దెబ్బతిన్న వరి పంటను అధికారులు పరిశీలించి నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని రైతు కోరుతున్నారు.

# ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో చైతన్య హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

## రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీలకు పలువురు విద్యార్థుల ఎంపిక




వేంపల్లె, అక్టోబర్ 25, ప్రభాతవార్త: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో వేంపల్లె చైతన్య హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చారు. కడప మున్సిపల్ స్టేడియం, పులివెందుల స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లలో నిర్వహించిన బాస్కెట్ బాల్, చెస్, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.కడప మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన అండర్14 బాస్కెట్‌బాల్ పోటీల్లో పి. ప్రణీత్, అభినవ్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అదేవిధంగా అండర్14 చెస్ విభాగంలోనూ చైతన్య హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై తమ ప్రతిభను చాటుకున్నారు.పులివెందుల స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన అండర్ 17 ఖోఖో పోటీల్లో మేఘనాథ్, తరుణ్ సాయి ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అథ్లెటిక్స్ విభాగంలో 800 మీటర్ల పరుగు పందెంలో బి. మైనావతి ప్రథమ స్థానం సాధించారు. 1,500 మీటర్ల పరుగు విభాగంలో బి. గౌతమ్ రెడ్డి, 400 మీటర్ల పరుగు విభాగంలో కాశేశ్వర్ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.విద్యార్థులు వివిధ క్రీడా విభాగాల్లో సాధించిన విజయాల పట్ల పాఠశాల చైర్మన్ బి. చక్రపాణి రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు. మిగతా 2పేజీలో

## మున్సిపల్ ఎన్నికల్లో ఉమ్మడి కడప జిల్లాలో

# కూటమి హవా

### 9 మున్సిపాలిటీలలో 7 ఏకగ్రీవం

### కడప, పులివెందుల, జమ్మలమడుగులోనే చైర్మన్ స్థానాలకు పోటీ

### పుంగనూరు మున్సిపాలిటీ టిడిపి ఏకగ్రీవం



ఎన్నికల అధికారి నుంచి రాజంపేట మున్సిపల్ చైర్మన్‌గా డిక్లరేషన్ తీసుకుంటున్న డాక్టర్ గాయత్రి, జగన్మోహన్ రాజు,



డిక్లరేషన్ ఫారం అందుకున్న బద్వేలు మున్సిపల్ చైర్మన్ సోమేసుల దివ్యతేజ



డిక్లరేషన్ ఫారం అందుకున్న కమలాపురం మున్సిపల్ చైర్మన్ గొంగలిరెడ్డి స్వప్న

రాజంపేట,బద్వేలు అక్టోబర్ 25 ప్రభాతవా జగన్ సొంత జిల్లాలో కూటమి చక్రం తిప్పింది. తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఆరు మున్సిపాలిటీలో ఏకగ్రీవం కాగా ఎర్రగుంట్ల మున్సిపాలిటీ బీజేపీ అభ్యర్థిగా గొర్ల మధులత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలో మున్సిపాలిటీల్లో పోటీ చేసిన చైర్మన్ అభ్యర్థులలో రాజంపేట మున్సిపల్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన డాక్టర్ దొంతం గాయత్రి అతిపిన్న వయస్కురాలిగా రికార్డ్ సృష్టించారు. జగన్ కోటలో పుర ఎన్నికల్లో మొదటిసారి పసుపు జెండా రెపరెపలాడింది. కడప జిల్లాలో మొత్తం 7 మున్సిపాలిటీలు, ఒక నగర పంచాయతీ, ఒక కార్పొరేషన్ ఎన్నికల్లో రాజంపేట మున్సిపల్ చైర్మన్‌గా డాక్టర్ దొంతం గాయత్రి, ఎర్రగుంట్ల గొర్ల మధులత, ప్రొద్దటూరు నంద్యాల రాఘవరెడ్డి, మైదుకూరు ధనపాల జగన్ మోహన్ రాజు, బద్వేల్ సోమశిల దివ్వతేజ, కమలాపురం గొంగలిరెడ్డి స్వప్న, అన్నమయ్య జిల్లా పుంగనూరు మున్సిపల్ చైర్మన్‌గా నయీమ్ తాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక్కడ 36 వార్డులుకాగా 34 ఏకగ్రీవం అయ్యాయి. ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక కార్పొరేషన్ లోను,జమ్మలమడుగు, పులివెందులలో మాత్రమే చైర్మన్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

**ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే ధ్యేయం**
**నూతన మున్సిపల్ చైర్మన్ దివ్యతేజ**

బద్వేలు మున్సిపాలిటీని కౌన్సిలర్లు, అధికారుల సహకారంతో అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని నూతనంగా ఎన్నికైన బద్వేలు మున్సిపల్ చైర్మన్ సోమేసుల దివ్యతేజ అన్నారు. బద్వేలు మున్సిపాలిటీ చైర్మన్ తో సహా 39 మంది కౌన్సిలర్లు ఏకగ్రీవమైన నేపథ్యంలో డిక్లరేషన్ ఫారం అందుకున్న అనంతరం ఆమె మాట్లాడుతూ బద్వేలు మున్సిపాలిటీని గతంలో నిధులు ఉన్నా అభివృద్ధి చేయడంలో గత పాలకవర్గం విఫలమైందని, అవసరం లేని చోట్ల రోడ్లు వేయడం, డ్రైనేజీలు లేకుండా రోడ్లు వేయడం లాంటి పనులతో ప్రజలను ఇబ్బందులు పెట్టడమే కాకుండా అదే అభివృద్ధి అని చెప్పుకుంటున్నారన్నారు. కానీ బద్వేలు మున్సిపాలిటీ ఏకగ్రీవంగా తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకునేందుకు సహకరించిన బద్వేలు ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. బద్వేలు మున్సిపాలిటీని అన్ని రంగాలలో అభివృద్ధి పరిచి టిడిపికి మంచి పేరు తెస్తామని పేర్కొన్నారు. మున్సిపాలిటీలో పాలకవర్గం ప్రమాణస్వీకారం చేసినప్పటినుంచి ప్రణాళిక బద్దంగా ప్రజలకు ఏస్థాయిలో అవసరమో వాటిని గుర్తించి ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి నులు చేపడతామన్నారు. టీడీపీకి చెందిన పాలకవర్గ హయాంలో మున్సిపాలటీ అభివృద్ధి అంటే ఏమిటో ఆస్థాయిలో అభివృద్ధి చేసి ప్రజా అవసరాలను తీర్చడంతో పాటు మారుమూల ప్రజానీకానికి కూడా మోలిక వసతులు కల్పించి ప్రజా మన్ననలు పొందడమే తమ ధ్యేయమన్నారు. తన పదవి వచ్చేందుకు సహకరించిన ప్రతి ఒక్క నాయకుడికి పేరు పేరునా ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్య అతి అతిధి, టీడీపీ సీనియర్ నాయకులు కమలాపురం మాజీ శాసన సభ్యులు పుత్తా నరసింహారెడ్డి, బద్వేలు టిడిపి ఇన్చార్జి మన్నూర్ సూర్యనారాయణ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు హరిప్రసాద్, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## జిల్లాలో తుఫాన్ పట్ల

# అప్రమత్తంగా ఉండండి



### అధికారులు సమన్వయంతో పనిచేయాలి

### జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్

మదనపల్లె, అక్టోబర్ 25 ప్రభాతవార్త : అన్నమయ్య జిల్లాలో తుఫాన్ పట్ల ముందస్తు చర్యలుచేపట్టాలని జిల్లాలోని అన్నిశాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. ఈమేరకు ఆదివారం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా బలపడే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ సూచించిందన్నారు. జిల్లాలోని అన్నిశాఖల అధికారులు తమ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు, ముంపునకు గురయ్యే అవాసాలు, చెరవులు, నీటి వనరులు, రహదారులు, విద్యుత్ వ్యవస్థలు తదితర ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన సిబ్బంది, వాహనాలు, యంత్రాలు, అత్యవసర పరికరాలు, నిత్యవసర సరుకులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, రోడ్లు భవనాలు, పంచాయితీరాజ్, విద్యుత్, వైద్య, ఆరోగ్య, అగ్నిమాపక, నీటిసరఫరా శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. తాగునీరు, వైద్యసేవలు, విద్యుత్ వంటి అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. వాతావరణ హెచ్చరికలను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సమాచారం ఇవ్వాలన్నారు.

## రాష్ట్రంలోనే అతిపిన్న వయస్కురాలిగా

# రాజంపేట మున్సిపల్ చైర్మన్‌గా డాక్టర్ గాయత్రి

### 24 ఏళ్లకే ఛైర్‌పర్సన్ పీఠం



డాక్టర్ దొంతం గాయత్రి

రాజంపేట, అక్టోబర్ 25, ప్రభాతవార్త : రాష్ట్రంలోనే కడప జిల్లా రాజంపేట మున్సిపల్ చైర్మన్‌గా 24 ఏళ్లకే ఛైర్‌పర్సన్ పీఠం పై అతిపిన్న వయస్కురాలిగా డాక్టర్ దొంతం గాయత్రి రికార్డు సృష్టించారు.వైద్యురాలిగా ప్రజలకు సేవలందించాల్సిన ఆమె. అనూహ్యంగా ప్రజాప్రతినిధిగా బాధ్యతలు చేపట్టబోతున్నారు. చిన్న వయసులోనే రాజకీయాల్లో కీలక పదవిని అందుకున్నారు. అన్నమయ్య జిల్లా రాజంపేట పురపాలక సంఘం ఛైర్‌పర్సన్‌గా 24 ఏళ్ల డాక్టర్ దొంతం గాయత్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలోనే అతి పిన్న వయస్కురాలైన ఛైర్‌పర్సన్‌గా ఆమె చరిత్ర సృష్టించనుంది. గాయత్రి తండ్రి దొంతం శివప్రసాద్ తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆయన టీడీపీ రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధిగా ఉన్నారు. తండ్రి రాజకీయ వారసత్వంతో గాయత్రి కూటమి అభ్యర్థిగా బరిలోకి దిగారు. రాజంపేట ఛైర్‌పర్సన్ పదవికి ఆమె నామినేషన్ దాఖలు చేశారు. ఈ ఎన్నికల్లో ఛైర్‌పర్సన్ అభ్యర్థులుగా ముగ్గురు నామినేషన్లు వేశారు. అయితే వైఎస్సార్సీపీ తరఫున దాఖలైన నామినేషన్లు సాంకేతిక కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. దీంతో గాయత్రి ఎన్నిక ఏకగ్రీవమైంది. నెల్లూరు నారాయణ డెంటల్ కళాశాలలో బిడిఎస్ పూర్తి చేసి వైద్య విద్య నుంచి ప్రజాసేవ వైపు ఆకర్షితురాలయ్యారు. కూటమి నాయకుల సహకారంతో రాజంపేటను అభివృద్ధి పథంలో నడిపిస్తానని గాయత్రి చెబుతున్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, పట్టణంలో మోలిక సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యమిస్తానని అన్నారు. మరోవైపు చదువును కొనసాగిస్తూనే ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహించాలని భావిస్తున్నారు. చిన్న వయసులోనే కీలక పదవి దక్కించుకున్న గాయత్రి, పట్టణాభివృద్ధిలో ఎలాంటి మార్పులు తీసుకొస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

## పీలేరు ఇందిరమ్మ కాలనీలో

# వర్షపు నీటి కష్టాలు!

### రెండేళ్లుగా ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకునే వారే లేరు..

### ఇళ్లలోకి నీరు, వీధిలో బురదతో ప్రజల అవస్థలు



పీలేరు అక్టోబర్ 25 ప్రభాతవార్త: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో వర్షపు నీటి సమస్యతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలోని ట్యాంకు ముందర వీధిలో 1310 ఫ్లాట్ నుంచి 1330 ఫ్లాట్ వరకు నివసిస్తున్న కుటుంబాలు వర్షం పడిన ప్రతిసారీ అవస్థలు పడుతున్నాయి. వీధిలోకి వచ్చే వర్షపు నీరు ఇళ్లలోకి చేరుతుండటంతో తమకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వర్షం పడితే ఇళ్లలోకి నీరు.. వీధి అంతా బురదమయం!**

గత రెండు, మూడు సంవత్సరాలుగా ఈ సమస్య కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని స్థానికులు వాపోతున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా కనీసం అధికారులు తమ వీధికి వచ్చి సమస్యను పరిశీలించిన సందర్భం కూడా లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**దోమలు, ఈగల బెడద.. పిల్లల ఆరోగ్యంపై ఆందోళన**

వీధిలో నీరు నిలిచి బురద పేరుకుపోవడంతో ఈగలు, దోమలు పెరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు వీధిలో తిరగడానికి,పాఠశాలలకు మిగతా 2పేజీలో

# ఎన్నికల కోడ్‌తో పీజీఆర్ఎస్ రద్దు

### సదరం పరీక్షలకు ఎన్నికల కోడ్ మినహాయింపు

అక్టోబర్ 25 ప్రభాతవార్త: నెల 26వ తేదీతో పాటు డిసెంబర్ 3 వరకు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ తాత్కాలిక నిలిపి వేస్తున్నట్లు జిల్లా కలెక్టర్, అన్నయ్యజిల్లా కలెక్టర్లు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఇది నిన్న తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అక్టోబర్ 14 నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు అమలులో ఉంటుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల నియమావళి ముగిసే వరకు ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేశారు.ప్రజలు ఈ విషయాన్ని గమనించి, ఫిర్యాదులు, అర్జీల సమర్పణ కోసం అక్టోబర్ 26న కలెక్టరేట్‌కు రావద్దని జిల్లా కలెక్టర్ సూచించారు.సదరం పరీక్షలకు ఎన్నికల కోడ్ మినహాయింపు..దివ్యాంగులకు సదరం వైకల్య నిర్ధారణ పరీక్షలు, ధ్రువపత్రాల జారీలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నప్పటికీ, దివ్యాంగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సాధారణ సదరం పరీక్షల కోసం క్రమం తప్పకుండా సమయాలను కేటాయించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం అను మతి ఇచ్చిందని పేర్కొన్నారు.సదరం ధ్రువపత్రాలు దివ్యాంగులకు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు, ఇతర ప్రయోజనాలు పొందేందుకు ఎంతో ఉపయోగపడతాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్హత ఉన్నప్పటికీ వైకల్య నిర్ధారణ పరీక్షలు పూర్తికాక లేదా ధ్రువపత్రాలు అందక ప్రభుత్వ ప్రయోజనాలు పొందడంలో ఆలస్యం ఎదుర్కొంటున్న వారికి ఈ నిర్ణయం ఎంతో మేలు చేస్తుందన్నారు.దివ్యాంగులకు అవసరమైన సేవలు నిరంతరాయంగా అందించాలనే ఉద్దేశంతో సాధారణ పరిపాలనా ప్రక్రియలో భాగంగా.. సదరం పరీక్షల నిర్వహణకు ఎన్నికల నియమావళి నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘం మినహాయింపు ఇచ్చినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకు సంబంధిత శాఖల అధికారులు కార్యాచరణ చేపట్టాలని సూచించారు. సదరం వైకల్య నిర్ధారణ పరీక్షలు అవసరమైన అర్హులైన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# ప్రజలు అప్రమత్తం చేయాలని అధికారులకు సూచనలు

### ఆర్డిఓ విజయలక్ష్మి



పీలేరు అక్టోబర్ 25 ప్రభాతవార్త: తుఫాన్ ముప్పు నేపథ్యంలో పీలేరు డివిజన్‌లోని ఎనిమిది మండలాల పీలేరు కలికిరి, కలకడ, కెవిపల్లి, వాల్మీకిపురం, గుర్రంకొండ, సదుం, సోమల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తహాశీల్దారు లకు ఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. తుఫాన్ కారణంగా ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే వెంటనే రెవెన్యూ అధికారులను సంప్రదించాలని, బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. ఆదివారం పీలేరులో విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయాలు వెల్లడించారు. గతంలో తుఫాన్ల సమయంలో పీలేరు మండలంలో పలు ఇబ్బందులు ఎదురైనప్పటికీ, రెవెన్యూ సిబ్బంది నిరంతరం స్పందించి ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించారని సూచించారు. ప్రస్తుతం తలెత్తనున్న ఆర్నబ్ తుఫాన్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.తుఫాన్ ప్రభావంతో ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే వెంటనే స్పందించి అవసరమైన సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు సేవలందించేందుకు రెవెన్యూ యంత్రాంగం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రతి గ్రామ పరిధిలో వీఆర్వోలు, వీఆర్ఏలు, ఇతర రెవెన్యూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రజలు ఆందోళన చెందకుండా అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన సహాయం కోసం తహసిల్దార్లను సంప్రదించాలని కోరారు.

# పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో ఆసక్తికర పోరు

### మున్సిపాలిటీలో 20 వార్డులు ఏకగ్రీవం

### మిగిలిన 20 వార్డుల్లో ముఖాముఖి పోరు

### చైర్మన్ పీఠంపై పార్టీల గురి

పులివెందుల, అక్టోబరు 25, ప్రభాత వార్త: పులివెందుల మున్సిపాలిటీ ఎన్నికల వేళ రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. మొత్తం 40 వార్డులకు గాను 20 వార్డులను కూటమి పక్షం ఏకగ్రీవం చేసుకోగా, మిగిలిన 20 వార్డుల్లో ఎన్నికల పోటీ జరగనుంది. ఈ వార్డుల్లో తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులతో పాటు పలు చోట్ల స్వతంత్ర అభ్యర్థులు కూడా బరిలో ఉండటంతో పోటీ రసవత్తరంగా మారింది.మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా ప్రధాన రాజకీయ పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఏకగ్రీవమైన వార్డులతో పాటు పోలింగ్ జరిగే వార్డుల్లో ఓటర్ల మద్దతు ఎవరికి లభిస్తుందనేది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**ఏకగ్రీవమైన వార్డులు 20**

పులివెందుల మున్సిపాలిటీలో 1, 2, 3, 4, 5, 7, 14, 16, 17, 19, 22,29,30,32,34,35,36,37,38,40వ వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ఈ వార్డుల్లో కూటమి పక్షం అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**మరో 20 వార్డుల్లో పోటీ**

6,8,9,10,11,12,13,15,18,20,21,23,24,25,26,27,28,31, 33, 39వ వార్డుల్లో అభ్యర్థుల మధ్య పోటీ జరగనుంది. ఈ వార్డుల్లో టీడీపీ, వైకాపా అభ్యర్థులు ప్రధానంగా తలపడుతుండగా, కొన్ని వార్డుల్లో స్వతంత్ర అభ్యర్థులు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటు న్నారు.6వ వార్డులో నరసింగం బాలుడు (టీడీపీ), పార్నపల్లి ఝాన్సీమేరీ (వైకాపా), పార్నపల్లి కిషోర్, మదూరు కిరణ్ (స్వతంత్రులు) పోటీలో ఉన్నారు. 8వ వార్డులో షేక్ బాబా ఫక్రుద్దీన్ (టీడీపీ), షేక్ ఖాదర్ బాషా (వైకాపా), షేక్ బాబా ఫకృద్దీన్ (స్వతంత్ర అభ్యర్థి) బరిలో ఉన్నారు.9వ వార్డులో ఆలూరు ముని సుభాషిని (జనసేన), యానావతి నీరజమ్మ (వైకాపా), 10వ వార్డులో నాయిని విజయలక్ష్మి (బీజేపీ), పూజారి నాగలక్ష్మి (వైకాపా) పోటీపడుతున్నారు.11వ వార్డులో షేక్ ఫయాజ్ షేక్ (టీడీపీ), మొహమ్మద్ భాష (వైకాపా), షేక్ నయాజ్ (స్వతంత్రుడు), 12వ వార్డులో షేక్ మొహమ్మద్ అక్రమ్ (టీడీపీ), షేక్ హాఫీజుల్లా (వైకాపా), షేక్ అన్వర్ బాషా (స్వతంత్రుడు) పోటీలో ఉన్నారు. 13వ వార్డులో నాయుని రామ్మోహన్ నాయుడు (టీడీపీ), మిఠాయి దాదా కళాందర్ (వైకాపా) మధ్య పోటీ నెలకొంది.15వ వార్డులో పెద్దింటి శివ (టీడీపీ), వల్లెపు వరప్రసాద్ (వైకాపా), బండి బోయిన కమలనాథ్, కొత్త రెడ్డి మల్లికార్జున్ రెడ్డి (స్వతంత్రులు) బరిలో ఉన్నారు. 18వ వార్డులో అంబకపల్లి మునేయ్య (టీడీపీ), కోళ్ల భాస్కర్ (వైకాపా), చింతలపల్లి శివగంగ, బోగ్గితి పురుషోత్తం (స్వతంత్రులు) పోటీపడుతున్నారు.20వ వార్డులో పెద్దమర్ల ముని వర్ధన్ (టీడీపీ), సోకే వెంకట రమణ (వైకాపా), 21వ వార్డులో బర్రె అంకిరెడ్డి (టీడీపీ), వైఎస్ మనోహర్ రెడ్డి (వైకాపా), 23వ వార్డులో బచ్చే కమలమ్మ (టీడీపీ), ముడియం రాజేశ్వరమ్మ (వైకాపా) మధ్య పోటీ జరగనుంది. 24వ వార్డులో షేక్ మహబూబ్ జాన్ (టీడీపీ), కొప్పల ప్రభావతి (వైకాపా), కొప్పల మమత, షేక్ నూర్జహాన్ (స్వతంత్రులు) పోటీలో ఉన్నారు. 25వ వార్డులో అన్నారెడ్డి శివ పార్వతి (టీడీపీ), బాలకొండ వరలక్ష్మి (వైకాపా), కమటం గులాబీ, సారే రెడ్డమ్మ (స్వతంత్రులు) బరిలో నిలిచారు.26వ వార్డులో కదిరి లక్ష్మీదేవి (టీడీపీ), ముత్తుకూరు కృష్ణవేణి (వైకాపా), 27వ వార్డులో చలిమ హేమావతి (టీడీపీ), కుప్పాల లక్ష్మి అనురాధ (వైకాపా), 28వ వార్డులో కొం గనపల్లి వెంకటసాయి కిషోర్ (టీడీపీ), గజ్జల విజయభాస్కర్ మిగతా 2పేజీలో

# ప్రొద్దుటూరు పురపాలక సంఘాన్ని కైవసం చేసుకున్న కూటమి

### మున్సిపల్ చైర్మన్‌గా నంద్యాల రాఘవరెడ్డి.. 52 మంది కౌన్సిలర్లు ఏకగ్రీవం




ప్రొద్దుటూరు అర్బన్,అక్టోబర్ 25, ప్రభాతవార్త స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీని కూటమి నాయకులు కైవసం చేసుకున్నారు. మున్సిపాలిటీలోని 52 వార్డులకు కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, చైర్మన్‌గా నంద్యాల రాఘవరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఎన్నికలను అధికారికంగా ధ్రువీకరించి, సంబంధిత ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. చైర్మన్‌గా ఎన్నికైన నంద్యాల రాఘవరెడ్డి తన ఎన్నికకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని స్వీకరించారు. అదేవిధం గా 52 మంది కౌన్సిలర్లు కూడా అధికారుల నుంచి తమ ధ్రువీకరణ పత్రాలను అందుకున్నారు. అన్ని వార్డుల్లో ఏకగ్రీవ ఎన్నికలు జరగడంతో మున్సిపా లిటీలో టీడీపీకి చెందిన అభ్యర్థులే కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, నంద్యాల కొండారెడ్డి, నంద్యాల రవీంద్రా రెడ్డి, నంద్యాల హరినాథ్ రెడ్డితో పాటు పలువురు టీడీపీ నాయకు లు, కార్య కర్తలు పాల్గొన్నారు. నూతన చైర్మన్, కౌన్సిలర్లకు అభినందనలు తెలియజేశారు.

**వార్డుల వారీగా ఏకగ్రీవంగా ఎన్నికైన 52 మంది కౌన్సిలర్లు..**

1. బొబ్బిలి దేవి, 2.పిల్లపాకి కృష్ణమ్మ, 3. కేసేపల్లి నాగరాజు, 4. శివశంకర్ సూర సూర, 5. ఎస్.డి. అమీనా దీరుబాయి, 6. నల్లబోతుల పావని, 7. ఒంటేరు విజయభాస్కర్ రెడ్డి, 8. గాండ్ల వీణ, 9. షేక్ జిలానీ బాషా, 10. ఎస్. అబ్దుల్ గఫార్, 11. పోచన శ్రీనివాసుల రెడ్డి, 12. కె. వెంకటలక్ష్మి, 13.ఎల్లాల షేక్ఇంతియాజ్ అహ్మద్, 14. ఆసం సురేష్‌కుమార్ రెడ్డి, 15.ఆసంప్రత్యూష, 16. షేక్ అలీ అక్బర్, 17. షేక్ షేర్ అలీ వడ్ల, 18. కతల్‌సాహెబ్ గారి జమీలా, 19. వై. ఎస్. ఆరిఫ్ హుస్సేన్,20. వై.ఎస్. ముజాహిద్దీన్, 21. నారాయణ సుభాషిణి, 22. కందకూరి అనసూయ, 23. సింగనమల కమల్ బీ, 24. పి. ఎలీషా, 25. వై.ఎస్. దౌలతున్, 26. షేక్‌మహినూర్. 27. చల్లా రాజగోపాల్, 28. గాజుల శివజ్యోతి, 29. ఉట్టి శారద, 30. ఉట్టి నరేంద్ర, 31. సోమా చెన్నకృష్ణమ్మ, 32. గంజికుంట కృష్ణవేణి, 33. చౌడం శ్రీలత, 34. కె.పద్మావతి 35. సాయి నిఖిత ఉట్టి. 36. చిలకల నాగవేణి 37. జ్యోతి చీమల 38. జింకా కళావతి, 39. ఇండ్ల లక్ష్మిలిఖిత, 40. తలారి పుల్లయ్య, 41. ఎన్. వెంకట కృష్ణ, 42. జి. సీతారామిరెడ్డి, 43. తమ్మినేని శైలజ, 44. ఈ. సునీల్ కుమార్, 45. శింగనమల హరికృష్ణ, 46. చెంగా సిద్దయ్య, 47. యనమల లక్ష్మీదేవి, 48. యనమల సుబ్బిరెడ్డి 49. జంబాపురం వెంకటలక్ష్మి, 50. వంగనూరు మురళీధర్ రెడ్డి, 51.సుబ్బారవితేజ,52.బొమ్మిరెడ్డిప్రసాద్ రెడ్డి

## మాధవరం1 ఆలయంలో భగవద్గీత శ్లోకాల పఠనం

### చిన్నారుల్లో నైతిక విలువల పెంపునకు భగవద్గీత దోహదం



సిద్ధవటం,అక్టోబర్ 25 ప్రభాతవార్త

మండలంలోని మాధవరం1 గ్రామంలో ఉన్న శ్రీ భద్రావతి భావనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం భగవద్గీత శ్లోకాల పఠన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు పాల్గొని భగవద్గీతలోని శ్లోకాలను భక్తితో పఠించారు. ఆలయ ప్రాంగణం చిన్నారుల శ్లోక పఠనంతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా గురువులు ఏఎస్ఐ సుబ్బరామచంద్ర, రూపాలక్ష్మి, శాంతిలు మాట్లాడుతూ భగవద్గీత కేవలం ఆధ్యాత్మిక గ్రంథమే కాకుండా, మనిషి జీవితానికి మార్గదర్శకమని తెలిపారు చిన్న వయస్సు నుంచే పిల్లలకు భగవద్గీతలోని శ్లోకాలను నేర్పించడం ద్వారా వారిలో క్రమశిక్షణ, వినయం, సహనం, పెద్దల పట్ల గౌరవం, నైతిక విలువలు పెంపొందుతాయని వివరించారు. భగవద్గీతలోని బోధనలు పిల్లలకు మంచి చెడుల మధ్య తేడాను తెలుసుకునే అవగాహన కల్పిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గురువులు ఏఎస్ఐ సుబ్బరామచంద్ర రూపాలక్ష్మి శాంతి పాల్గొన్నారు.

## అన్నమయ్య జిల్లాలో భారీ వర్షం

### రాయచోటి 9,నిమ్మనపల్లిలో 7సెంటీమీటర్ల వర్షం
### కడప జిల్లాలో ఒక మోస్తరు వర్షం
### సింహాద్రిపురం7.5, జమ్మలమడుగు 6 సెం.మీ. వర్షం



రాయచోటి వీధుల్లో ఏరులా ప్రవహిస్తున్న వర్షం నీరు

రాజంపేట, అక్టోబర్ 25, ప్రభాతవార్త

ఎల్నినో దెబ్బకు తీవ్ర వర్షాభావ పరిస్థితులతో విలవిలాడుతున్న రైతాంగానికి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడం ఊరటనిచ్చింది. శనివారం అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా భారీ వర్షపాతం నమోదయింది. రాయచోటి 90 మిల్లీమీటర్లు,గాలివీడులో 66.2, చిన్నమండెం 58,సంబేపల్లి 37.4 ,లక్కిరెడ్డిపల్లి 42 ,రామాపురం 28.2, ములకలచెరువు 25.4 ,తంబళ్లపల్లె 30.6 ,పెద్దమండెం 50.4 కురబలకోట 14, పెద్ద తిప్ప సముద్రం 16.8 ,బి కొత్తకోట 37, మదనపల్లె 48.2 ,నిమ్మలపల్లి 76.6 ,చౌడేపల్లె 7.6 రామసముద్రం 7.6, పుంగనూరు 10 ,గుర్రంకొండ 23, కలకడ 22.4 ,ఖమ్మం వారి పల్లె 15.4 ,పీలేరు 48.4 ,కలికిరి 6.8, సదుం 6.8 వాల్మీకిపురం 62.4, సోమల 4మిల్లీమీటర్ల వర్షపాతం నమోద యింది. కడప జిల్లాలో ఒక మోస్తరు వర్షపాతం నమోదయింది. జిల్లాలోని కొండాపురం, మైలవరంలలో 44.2 మిల్లీమీటర్ల వర్షం,వీరబల్లి 44.8, జమ్మ లమడుగు 59.2 సింహాద్రిపురం 75.6 లింగాల 15.8 పులివెందుల 11.6 వల్లూరు 16 14 ఒంటిమిట్ట 20.4 వేంపల్లి 164 చక్రాయపేట 19.2 టి సుండుపల్లె 14.2 నందలూరు 18.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

## ఎంపీటీసీ అభ్యర్థులకు ఫారం-బి తప్పనిసరి

### రిటర్నింగ్ అధికారి కృష్ణయ్య



సిద్ధవటం, అక్టోబర్ 25, ప్రభాతవార్త:

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు ఫారం-బి తప్పనిసరిగా సమర్పించాలని రిటర్నింగ్ అధికారి కృష్ణయ్య తెలిపారు. ఆదివారం మండల కేంద్రమైన సిద్ధవటం ఎంపీడీవో కార్యాలయ సభా భవనంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 11 ఎంపీటీసీ స్థానాలకు దాఖలైన 32 నామినేషన్లను పరిశీలించి ఆమోదించినట్లు వెల్లడించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నిబంధనల ప్రకారం ఫారం-బి సమర్పించాలని సూచించారు. పోటీ నుంచి విరమించుకోవాలనుకునే అభ్యర్థులు ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు మాత్రమే తమ ఉపసంహరణను తెలియజేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఓ ఫణిరాజకుమారి, ఏవో సోమశేఖర్ పాల్గొన్నారు.

## పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో ఆసక్తికర పోరు

మొదటి పేజీ తరువాయి

రెడ్డి (వైకాపా) పోటీపడుతు న్నారు.31వ వార్డులో సాతుపతి శ్రీనివాసులు (టీడీపీ), కావేటి అంజనప్ప (వైకాపా), సాతుపతి సరస్వతి (స్వతంత్ర అభ్యర్థి) బరిలో ఉన్నారు. 33వ వార్డులో తూగుట్ల మధుసూదన్ రెడ్డి (టీడీపీ), కల్లూరు నిరంజన్ రెడ్డి (వైకాపా), 39వ వార్డులో దేరంగుల అనిత (టీడీపీ), మంజుల నందిని (వైకాపా) మధ్య ముఖాముఖి పోటీ జరగనుంది.

**కొన్ని వార్డుల్లో రెండేసి ఓట్లు**

ఎన్నికల వివరాల ప్రకారం, 20 వార్డుల్లో ఓటర్లు రెండు ఓట్లు వేయాల్సి ఉండగా, మిగిలిన 20 వార్డుల్లో ఒక్క ఓటు మాత్రమే వేయనున్నారు. ఈ నేపథ్యంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే సమయంలో ఓటింగ్ విధానంపై స్పష్టత కలిగి ఉండాల్సిన అవసరం ఉంది.మొత్తంగా 20 వార్డులు ఏకగ్రీవం కావడం, మరో 20 వార్డుల్లో పోటీ జరగనుండటంతో పులివెందుల మున్సిపల్ ఎన్నికలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పోలింగ్ జరిగే వార్డుల్లో ఓటర్లు ఎవరికి పట్టం కడతారో, మున్సిపల్ చైర్మన్ పీఠం ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

## వైన్స్ పక్కనే బెల్ట్ షాప్.. అధిక ధరలకు మద్యం విక్రయం

రామసముద్రం, అక్టోబర్ 25ప్రభాతవార్త

రామసముద్రం మండలం చెంబకూరు పంచాయతీ పరిధిలోని ఎస్ఆర్ వైన్స్ పక్కనే ఉదయం నుంచే బెల్టు షాపులో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని, వైన్స్ షాపులో అమ్మాల్సిన తక్కువ ధర మద్యాన్ని పక్కనే ఉన్న బెల్టు షాపులో అమ్ముతున్నారని పక్కా సమాచారం ఉన్నట్లు ప్రజలు చెబుతున్నారు.ఈ విషయంపై ఎక్సైజ్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. తక్షణమే అధికారులు చర్యలు తీసుకొని బెల్టు షాపును సీజ్ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



ఉదయాన్నే మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్న బెల్టు షాపు యజమాని.

## రాజీలేని సమరశీల పోరాటాలు యుటిఎఫ్‌కే సాధ్యం

### యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్




బద్వేల్ అర్బన్, అక్టోబర్ 25, ప్రభాతవార్త :

విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని సమరశీల పోరాటాలు ఒక్క యుటిఎఫ్‌కే సాధ్యమని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం పోరుమామిళ్ల పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ పోరుమామిళ్ల ప్రాంతీయ మండలాల కౌన్సిల్ సమావేశం యుటిఎఫ్ పోరుమామిళ్ల మండల అధ్యక్షులు బి.ఈశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాదన విజయ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం యుటిఎఫ్ నిరంతరం పోరాటాలు సాగిస్తున్నదన్నారు. ఒకవైపు ఉపాధ్యాయుల, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూనే మరోవైపు ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకునే బాధ్యత యుటిఎఫ్ చేపట్టిందన్నారు. ఉపాధ్యాయుల హక్కుల సాధనలో యుటిఎఫ్ పాత్ర శ్లాఘనీయమన్నారు. రీ గ్రూపింగ్ స్కేల్స్ సాధన, అప్రెంటీస్ విధానం రద్దు, ఉపాధ్యాయ బదిలీలలో కౌన్సిలింగ్ విధానం లాంటి సౌకర్యాలను ఉపాధ్యాయ లోకానికి సాధించి పెట్టడంలో ప్రధాన పాత్ర పోషించింది యుటిఎఫ్ మాత్రమేనన్నారు. యుటిఎఫ్ ఉపాధ్యాయ సమస్యలకే పరిమితం కాకుండా పలు సామాజిక కార్యక్రమాల్లో సైతం పాల్గొనిందని ఆయన పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలైన భూకంపాలు, వరదలు సంభవించిన సందర్భంలో కూడా యుటిఎఫ్ ప్రజలకు అండగా నిలిచిందన్నారు. కరోనా మహమ్మారి సమాజాన్ని అతలాకుతలం చేసినప్పుడు సైతం సహాయ కార్యక్రమాలను చేపట్టిందన్నారు. పిఆర్సీ అమలు కోసం పోరుబాట చేపట్టి పిఆర్సీని సాధించడంలో సఫలమైందన్నారు. పెండింగ్ డిఎ లను విడుదల చేయించడంలోనూ, ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను ఇప్పించడంలోను యుటిఎఫ్ చేపట్టిన పోరాటం చారిత్రాత్మకమైనదన్నారు. రణభేరి పేరుతో యుటిఎఫ్ చేపట్టిన పోరాట ఫలితంగానే ప్రభుత్వం 12వ పిఆర్సీని నియమించిందని ఆయన తెలిపారు. త్వరలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతిని ఇప్పించడంలో సైతం యుటిఎఫ్ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. యుటిఎఫ్ జిల్లా సహాయ అధ్యక్షులు వై.రవికుమార్, జిల్లా కార్యదర్శులు కుర్రా చెన్నయ్య, కె.ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ బడిని పరిరక్షించుకునేందుకు ఊరి బడిని కాపాడుకుందాం అనే నినాదంతో యుటిఎఫ్ చేపట్టిన ఎన్రోల్మెంట్ డ్రైవ్ సత్ఫలితాలనిచ్చిందన్నారు. ప్రభుత్వ బడులు కొనసాగితేనే పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రభుత్వ బడులను కాపాడుకునేందుకు ఉపాధ్యాయ లోకం నడుం బిగించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ల మండల విద్యాశాఖ అధికారి టి.శివకుమార్, ప్రధానోపాధ్యాయులు ఎ.కొండిశెట్టి, కె.గంగయ్య, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బండి పరిమళ జ్యోతి, యుటిఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శులు జెడ్.జయరామయ్య, కె.జోజయ్య, ఈరి బాలజోజి, పోరుమామిళ్ల, కలసపాడు, కాశి నాయన, బి.కోడూరు మండలాల యుటిఎఫ్ నాయకులు ఎం.రమణ మూర్తి, మహబూబ్ బాషా, జి.బాల ఓబయ్య, ఎన్.సురేష్ రవికుమార్, బి.భాస్కర్ రెడ్డి, కృష్ణయ్య, ఎల్.పిచ్చిరెడ్డి, ఎన్.కొండయ్య కె.జె.ప్రవీణ్ కుమార్, కె.చెన్న కృష్ణయ్య, ఎస్.కె.నాయబ్ రసూల్, డి.సెబాస్టియన్ పాల్గొన్నారు.

## బురదనీటిని తలపిస్తున్న వెలిగల్లు శుద్ధి జలాలు

### రంగు మారిన నీటితో ప్రజల అవస్థలు



గాలివీడు, అక్టోబర్ 25. ప్రభాతవార్త:

వెలిగల్లు జలాశయం ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు మట్టి రంగులోకి మారి బురదనీటిని తలపిస్తోందని గాలివీడు మండల కేంద్రంలోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని గేటు నాలుగురోడ్ల కూడలి పరిసర నివాసాలకు సరఫరా అవుతున్న నీరు ఇలా మట్టి రంగులో ఉండటంతో వాటిని ఎలా సేవించాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ప్రాజెక్టు ద్వారా ఇలాంటి నీరు సరఫరా కావడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.కరువు పీడిత ప్రాంతాలైన గాలివీడు, లక్కిరెడ్డిపల్లి, రామాపురం మండలాల్లోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే వెలిగల్లు జలాశయ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు మొత్తం 4.64 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగి ఉండగా, రాయచోటి పట్టణ ప్రజల తాగునీటి అవసరాల కోసం 0.30 టీఎంసీల నీటిని కేటాయించినట్లు పేర్కొంటున్నారు.ముఖ్యంగా ఈ ప్రాంతంలోని భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్, ఇతర లవణాల ప్రభావాన్ని తగ్గించి ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించాల్సి ఉంది. అయితే, క్షేత్రస్థాయిలో సరఫరా అవుతున్న నీటి రంగు, నాణ్యతపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మట్టి రంగులో వస్తున్న నీటిని తాగడానికి మాత్రమే కాకుండా, కనీసం గృహావసరాలకు వినియోగించుకోవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు...నీటి నాణ్యతపై పరీక్షలు నిర్వహించాలి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. నీరు రంగు మారడానికి గల కారణాలను గుర్తించి, సరఫరా అవుతున్న నీటి నాణ్యతపై తక్షణమే పరీక్షలు నిర్వహించాలని కోరుతున్నారు. అవసరమైన చర్యలు చేపట్టి సురక్షితమైన తాగునీటిని అందుబాటులోకి తీసుకురావాలని వెలిగల్లు ప్రాజెక్టు అధికారులు, సంబంధిత తాగునీటి విభాగం అధికారులను ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మట్టిలోని మాణిక్యాన్ని వెలికితీసిన అపర భగీరథుడు 'జానమద్ది'

### ఆం.ప్ర.రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తులు డా.. జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు



వైవియూ, అక్టోబర్ 25, ప్రభాతవార్త :

'తెలుగు సూర్యుడు' సి.పి.బ్రౌన్ అనే మట్టిలోని మాణిక్యాన్ని వెలికితీసిన అపర భగీరథుడు డా.జానమద్ది హనుమచ్ఛాస్త్రి అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తులు డా. జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు అన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలోని బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో ఆదివారం డా.జానమద్ది హనుమచ్ఛాస్త్రి 101వ జయంతి అలానే 15వ గ్రంథాలయ, సాహిత్య సేవా పురస్కార ప్రదానోత్సవ కార్యక్ర మాన్ని జానమద్ది సాహితీ పీఠం వారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా జానమద్ది చిత్రపటానికి అతిథులు పూలమాలను సమర్పించి నివా ళులు అర్పించారు. అనంతరం జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో లంకా సూర్యనారాయణ, డా. శాంతి నారాయణలకు గ్రంథాలయ, సాహిత్య సేవా పురస్కారాలు ప్రదానం చేశారు. జానమద్ది సాహితీ పీఠం కార్యదర్శి జాన మద్ది యామిని కార్యదర్శి నివేదికను సమర్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తి డా. జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు మాట్లాడుతూ పోతన భాగవత రచనకు శ్రీరాముడు సాక్షాత్కరించిన పుణ్యభూమి కడప అని అన్నారు. సి.పి.బ్రౌన్ వేమనను వెలుగులోకి తేగా జానమద్ది హనుమచ్ఛాస్త్రి బ్రౌన్‌ను విశ్వవ్యాప్తం చేశార న్నారు. గౌరవ అతిథి, యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల నుంచి, ఉపా ధ్యాయుల నుంచి తెలుసుకోలేని ఎన్నో వైజ్ఞానిక అంశాలకు గ్రంథాలయం నెలవని, అలాంటి గ్రంథాలయాన్ని నిర్మించిన జానమద్ది ధన్యజీవి అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని జానమద్ది సాహితీపీఠం మేనేజింగ్ ట్రస్టీ జాన మద్ది విజయభాస్కర్ సమన్వయం చేశారు. నిర్వాహకులు అతిథులను అలానే పోతుల వెంకట్రామిరెడ్డి, గునిశెట్టి సాయికుమార్, యలమర్తి మధుసూదన్ లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జానమద్ది కుటుంబస భ్యులు, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య గంజి పార్వతి, సిబ్బందిడా.చింతకుంట శివారెడ్డి డా. భూతపురి గోపాల కృష్ణ శాస్త్రి, ఆచార్య సుబ్బారెడ్డి, షేక్ ఇంతియాజ్, డా. అంకే శ్రీనివాస్, అడవాల శేషగిరి రాయుడు, డా. టి.సురేష్ బాబు, ఎల్. గోవింద రెడ్డి, డా.వెల్లాల వేంకటేశ్వరాచారి, కొండూరి జనార్దన రాజు, శ్యామసుందర్ రెడ్డి, రాజారెడ్డి, కొత్తపల్లె రామాంజనేయులు, సూర్య నారాయణ రెడ్డి, గోపాల్, జానమద్ది అభిమానులు పాల్గొన్నారు.

## బిజెపి7వ వార్డు కౌన్సిలర్ గా ఒంటేరు విజయ భాస్కర్ రెడ్డి ఏకగ్రీవం



ప్రొద్దుటూరు అర్బన్ అక్టోబర్ 25 ప్రభాత వార్త

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ 7వ వార్డు బిజెపి కౌన్సిలర్ గా ఒంటేరు విజయభాస్కర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆదివారం రిటర్నింగ్ అధికారితో డిక్లరేషన్ ఫారం అందుకున్నారు. వంటేరు భాస్కర్ రెడ్డి 1992లో బీజేవైఎం కార్యకర్తగా పనిచేసి 2004లో బిజెపి కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేసి గట్టి పోటీ ఇచ్చి స్వల్ప ఓట్లతో ఓటమి చెందారు. అనంతరం తెలంగాణ, కర్ణాటకలో రాష్ట్రాలలో బిజెపిలో పనిచేసి ప్రముఖ నాయకులతో గుర్తింపు పొందారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో ధర్మవరం నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థిగా పోటీ చేసిన ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ కు గెలుపుకు తీవ్రమైన కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు గుర్తింపు ఇచ్చిన బిజెపి పార్టీకి ఏడో వార్డు ప్రజలకు కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. వార్డు ప్రజలకు తాను అన్ని విధాల అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి తగిన కృషి చేస్తా అన్నారు.

## అమీన్ పీర్ దర్గాలో ఆహార భద్రతపై అధికారుల తనిఖీలు

### భక్తులకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందించాలని సూచనలు



కడప, అక్టోబర్ 25, ప్రభాతవార్త:

అమీన్ పీర్ దర్గా వద్ద జరుగుతున్న ఉరుసు మహోత్సవాల సందర్భంగా భక్తులకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందేలా జిల్లా ఆహార భద్రతా అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఆదివారం మొదటి రోజు గంధోత్సవం జిల్లా ఆహార భద్రతాధికారి ఓ.వి. రాముడు ఆధ్వర్యంలో ఆహార భద్రతాధికారి ఎం. హరిత, ఇతర సిబ్బంది దర్గా పరిసరాల్లో ఆహార విక్రయాలు, ఆహార తయారీ, పంపిణీకి సంబంధించిన ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆహార తయారీ కేంద్రాలు, ఆహార పదార్థాల నిల్వ, పంపిణీ ప్రాంతాల్లో పరిశుభ్రతను తనిఖీ చేశారు. ఆహార పదార్థాలను పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేయాలని, నాణ్యత విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని నిర్వాపకులకు సూచించారు. ఆహార పదా ర్థాలను కలుషితం కాకుండా భద్రపరచడంతో పాటు, వంట చేసే ప్రాంతాలు, పాత్రలు, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. దర్గా కార్యక్రమాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సురక్షితమైన ఆహారం అందించేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఆహార భద్రతాధికారి ఓ.వి. రాముడు ఆదేశించారు.

## రాష్ట్రస్థాయిలో ఇర్ఫాన్ బాషాకు కీలక బాధ్యత

### కాంగ్రెస్ పార్టీ 'ఓట్ బచావో - దేశ్ బచావో' కార్యక్రమానికి పీసీసీ కోఆర్డినేటర్‌గా ఇర్ఫాన్ బాషా నియామకం!



ప్రొద్దుటూరు అర్బన్ అక్టోబర్ 25 ప్రభాతవార్త

ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి ఆదేశాల మేరకు, ప్రొద్దుటూరు కాంగ్రెస్ ఇన్‌చార్జి ఇర్ఫాన్ బాషాకు ఆంధ్రప్రదేశ్ కోఆర్డినేటర్‌గా కీలక బాధ్యతలు అప్పగించారు. ఈరోజు విడుదలైన ఏపీసీసీ అధికారిక నియామక ఉత్తర్వుల్లో ఇర్ఫాన్ బాషా పేరును ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు అవగాహన లక్ష్యంగా చేపట్టిన ఈ ప్రచారంలో పార్టీ నాయకులతో సమన్వయం చేస్తూ ఇర్ఫాన్ బాషా కీలక పాత్ర పోషించనున్నారు. ఈ బాధ్యతల్లో భాగంగా ఇర్ఫాన్ బాషా ప్రధానంగా నంద్యాల, కర్నూలు, వైఎస్ఆర్ కడప, శ్రీ సత్యసాయి, అన్నమయ్య, అనంతపురం జిల్లాలపై దృష్టి సారించనున్నారు. ప్రొద్దుటూరు నుంచి రాష్ట్రస్థాయి బాధ్యతల దిశగా ఇర్ఫాన్ బాషా ప్రస్థానం! స్థానిక ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం, పార్టీ ఉద్యమాలైన, ప్రజాస్వామ్య కార్యక్రమాలైన ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో ఇర్ఫాన్ బాషా చూపిన చొరవ, కృషి, ప్రజా గొంతుకగా ఆయన చేస్తున్న పోరాటాలను గుర్తించిన పార్టీ అధిష్ఠానం ఈ కీలక బాధ్యతను అప్పగించినట్లు పార్టీ వర్గాల నుంచి వస్తున్న సమాచారం.ఈ సందర్భంగా ఇర్ఫాన్ బాషా మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి పీసీసీ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగించిన ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డికి, డీసీసీ అధ్యక్షురాలు ఎన్ది విజయజ్యోతికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకత్వం తనకు అప్పగించిన బాధ్యతను అంకితభావంతో నిర్వహిస్తూ, కాంగ్రెస్ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.ఓట్ బచావో - దేశ్ బచావో ప్రచారం ద్వారా ఓటు హక్కు ప్రాధాన్యత, ప్రజాస్వామ్య పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.

## సూక్ష్మ పరిశీలకులు ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వహించాలి

### శిక్షణా కార్యక్రమంలో సాధారణ పరిశీలకులు గణేష్ కుమార్ సూచనలు

కడప, అక్టోబరు 25, ప్రభాతవార్త:

స్థానిక సంస్థల ఎన్నికలు-2026లో సూక్ష్మ పరిశీలకులు తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని సాధారణ పరిశీలకులు జి. గణేష్ కుమార్ సూచించారు. ఆదివారం కడప నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల (మెయిన్)లో నిర్వహించిన సూక్ష్మ పరిశీలకుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి ఎన్నికల విధులపై పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ, ఎన్నికల ప్రక్రియలో జరిగే ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలని తెలిపారు.

## పోలీసుల త్యాగం మరవలేనిది

### ఆర్ఎస్ఐ నరసింహులు



సిద్ధవటం, అక్టోబర్ 25 ప్రభాతవార్త :

శాంతిభద్రతల పరిరక్షణలో మరియు ఉగ్రవాదుల దాడులను తిప్పికొట్టడంలో ప్రాణాలు అర్పించిన పోలీసుల త్యాగాలు ఎప్పటికీ మరవలేనివని ఆర్ఎస్ఐ నరసింహులు పేర్కొన్నారు.పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా, ఆదివారం సాయంత్రం ఏపీఎస్పీ 11వ పోలీస్ పటాలయం కమాండెంట్ ఆనంద్ రెడ్డి ఆధ్వర్యంలో సిద్ధవటం మండల కేంద్రంలోని ఎగువపేట పోలీస్ లైన్ క్రాస్ సమీపంలో 5వ రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్ఎస్ఐ నరసింహులు మాట్లాడుతూ సమాజంలో ప్రజల రక్షణ కోసం విధులు నిర్వహిస్తూ, ఉగ్రవాదుల దాడుల్లో ఎంతోమంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేసుకున్నారు వారి అమూల్యమైన సేవలను స్మరించుకుంటూ ప్రతి ఏటా అక్టోబర్ 21 నుండి 30వ తేదీ వరకు పోలీస్ అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సిద్ధవటం పోలీస్ సిబ్బందితో పాటు ఏపీఎస్పీ పటాలయం ఆర్ఎస్ఐలు నరసింహులు, జి. సుబ్బయ్య, బ్యాండ్ సెట్ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రూప్రాంపేట శ్రీ పార్వతి సమేత శివానంద స్వామి ద్వాదశ గిరి ప్రదక్షిణ మహోత్సవం



గోపవరం. అక్టోబర్ 25. ప్రభాతవార్త.

కడప జిల్లా గోపవరం మండలం మడకవారిపల్లె రూప్రాంపేట శ్రీపార్వతీ సమేత శివానంద స్వామి ఆలయంలో ద్వాదశ గిరి ప్రదక్షిణ మహోత్సవం ఎంతో అంగరంగ వైభవంగా జరుగుతుంది. ప్రతి నెల పౌర్ణమి రోజున ఏపీఐఐసీ డైరెక్టర్ వద్ది బోయిన ప్రసాద్ రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా గిరిప్రదక్షిణ మహోత్సవం జరుగుతుంది ఈ మహోత్సవం వెంబడి బ్రహ్మయ్య కోలాటం వచ్చిన భక్తులకు స్వామివారి వారి భక్తి పాటలతో అలరించారు స్వామివారి మహోత్సవం వెంట ప్రసాద్ రెడ్డి వారి ధర్మపత్ని ప్రమీలమ్మ వీరి కుమారుడు సాయికిరణ్ రెడ్డి, ఈ గిరిప్రదక్షిణ మహోత్సవా నికి ఆలయ ఈవో కృష్ణయ్య మరియు కార్యనిర్వాహన అధికారి ప్రధాన అర్చకులు గానుగపాటి రాజశేఖర్ శర్మ మరియు ఆలయ చైర్మన్ మరియు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా గిరిప్రదక్షిణ మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు ప్రతి ఒక్కరికి ఆలయ కమిటీ వారు అల్పాహారం ఏర్పాటు చేసినారు.

## గుర్తుతెలియని దుండగులు చోరీకి యత్నం

వాల్మీకిపురం, అక్టోబర్ 25 ప్రభాతవార్త :

పట్టణానికి చెందిన బాబాప్రసాద్ స్థానిక పోలీసుస్టేషన్లో హోంగార్డుగా పనిచేస్తూ స్థానిక నాయక్ వీధి సమీపంలోని రైల్వేగేటు వద్ద నివాసం ఉంటున్నాడు. ఆదివారం తెల్లవారిజామున 2.30గంటల సమయంలో గుర్తుతెలియని ముగ్గురు దుండగులు ముసుగులు ధరించి బాబాప్రసాద్ ఇంట్లో చోరికి యత్నించే క్రమంలో అక్కడే ఉన్న దాదాపు రూ.20వేలు విలువచేసే సీసీకెమరాలను ధ్వంసం చేశారు. ఈ ధ్వంసం చేసే సమయంలో హోంగార్డు ఇంట్లో నిద్రిస్తుండగా శబ్దాలు రావడంతో పక్కంటివారికి సమాచారం అందించడంతో పాటు లేచి బయటకు వచ్చి ఇంటిమందు లైట్లను ఆన్ చేశాడు అదే సమయంలో పక్కంటివారు కూడా లైట్లను ఆన్ చేయడంతో అక్కడి నుంచి దుండగలు పరుగులు తీసి పరారయ్యారు. ఇదే వీధిలో రెండువారాల క్రితం దొంగతనం జరిగింది. మాసం క్రితం చింతపర్తిలో సైతం ఒకే రాత్రి రెండు దొంగతనాలు జరిగాయి. ఇక్కడ పాల్పడిన ముగ్గురు దుండగలే వరుస చోరీలకు పాల్పడినట్లు తెలుస్తుందని బాధితుడు అంటున్నాడు. జరిగిన సంఘటన రూ. 20వేల సీసీకెమరాల నష్టంపై బాధితుడు స్థానిక ఎస్సై తిప్పేస్వామికి ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## వర్షపు నీటి కష్టాలు!

మొదటి పేజీ తరువాయి



వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

**ఇప్పటికైనా అధికారులు స్పందించాలి..**

గత రెండేళ్లకు పైగా తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా పరిష్కారం లభించకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత పంచాయతీ అధికారులు వెంటనే ఇందిరమ్మ కాలనీలోని ట్యాంకు ముందర వీధిని సందర్శించి, వర్షపు నీరు ఇళ్లలోకి చేరకుండా శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు వీధిలో బురద తొలగించి, నీటి పారుదలకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించి, వర్షాకాలంలో ఎదురవుతున్న ఇబ్బందుల నుంచి విముక్తి కల్పించాలని ఇందిరమ్మ కాలనీ వాసులు కోరుతున్నారు.

## చైతన్య హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

మొదటి పేజీ తరువాయి

చదువుతో పాటు క్రీడలకు కూడా పాఠశాలలో ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, వారు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో మరిన్ని విజయాలు సాధించేలా అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు.విద్యార్థుల విజయాల పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, క్రీడా విభాగం సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. తదుపరి స్థాయి పోటీల్లోనూ విద్యార్థులు విజయాలు సాధించి పాఠశాలకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## నలుగురు జూదరులు అరెస్ట్

దువ్వూరు, అక్టోబర్ 25, ప్రభాతవార్త:

మండల పరిధిలోని జిల్లెల్ల గ్రామ సమీపంలో ఉన్న రెస్ట్ హౌస్ వద్ద సమీపంలోని కంపచెట్లలో జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ధనుంజయుడు తెలిపారు. ముందుగా రాబడిన సమాచారం మేరకు స్థానిక పోలీసులచే దాడులు నిర్వహించామని, నలుగురు జూదరుల నుంచి 6530 రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి త్వరలో కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు.

**LOSS OF PASSPORT**

I PATAN BABA PAKRUDIN S/o. PATAN JAFFERKHAN, Residing at D.No. 11-4, Uyyalavandla Palli, Singamvaripalli, Araveedu, Galiveedu, Annamaiah Dist., A.P. Hereby state. That my Passport No. F-4365475 Old and issued at Hyderabad which was lost of my passport in Galiveedu Bustand. If found kindly return to me or inform the nearest police station. This notice is given to recard the loss

# కార్పెంటర్లకు ప్రభుత్వం ద్వారా వచ్చే ప్రయోజనాలు సాధించుకుందాం

**ప్రొద్దుటూరు అర్బన్ అక్టోబర్ 25 ప్రభాతవార్త**

ప్రొద్దుటూరు కార్పెంటర్స్ అసోసియేషన్ ఏర్పాటయి మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం కొర్రపాడు రోడ్డులోని రోడ్లు భవనాల అతిథి గృహం ఎదురుగా గల ఆఫీస్ నందు సమావేశం జరిగింది. ఈ సమావేశమునకు ప్రొద్దుటూరు పరిసర ప్రాంతాలలో గల కార్పెంటర్లు పాల్గొన్నారు.. ఈ అసోసియేషన్లో గల కార్పెంటర్స్ పనిచేయు అన్ని కులాల వారికి సంబంధించి వారి శ్రేయస్సు కోసం అందరిని కలుపుకొనిఅసోసియేషన్ ఏర్పాటు జరిగిందన్నారు. ముఖ్యంగా కార్పెంటర్ (చెక్కపని ) పనిచేయు సోదరులకు ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలను అమలు చేయుట, ఆర్థికంగా వెనుకబడిన వారికి అసోసియేషన్ ద్వారా సహాయం చేయడం, కార్పెంటర్స్ పనిచేయవారందరికీ శుభ అశుభ కార్యాలలో వారి కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కార్పెంటర్లు తాళ్లమాపురం రామయ్య, సుల్తాన్, దాదాపీర్, షరీఫ్, ధనంజయ ఆచారి, బొల్లవరం భాషా, షరాబు శంకరయ్య ఆచారి పాల్గొన్నారు. వీరిని కార్పెంటర్ సోదరులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కమ్మర వీరాంజనేయచారి, తప్పెట నరసింహ, కోశాధికారి షేక్ చాంద్ బాషా, కార్యవర్గ సభ్యులు, ప్రొద్దుటూరు పరిసర ప్రాంత కార్పెంటర్లు పాల్గొన్నారు.



## నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి వ్యక్తి మృతి

**తొండూరు అక్టోబర్ 25 ప్రభాతవార్త:**



తొండూరు మండలంలోని గంగాదేవి పల్లె గ్రామానికి చెందిన వై. వరుణ్ కుమార్ రెడ్డి తన బైక్‌లో వస్తు వాగు దాటే ప్రయత్నంలో నీటి ప్రవాహానికి తట్టుకోలేక కొట్టుకుపోయి మృతి చెందాడు. వరుణ్ కుమార్ రెడ్డి తన చిన్నమ్మ చిన్నాన్నలను కలవడానికి కసునూరుకు దసరా సెలవుల సందర్భంగా వెళ్లడం జరిగింది. తిరుగు ప్రయాణంలో శనివారం కురిసిన భారీ వర్షానికి దుద్దేకుంట వంక ఉధృతంగా ప్రవహిస్తున్నది దానిని దాటే ప్రయత్నంలో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి మృతి చెందడం జరిగింది. మృతుడు ఆరు నెలల కిందట వివాహం జరిగింది అతని భార్య నెలల గర్భవతి అని తెలిసి గంగాదేవి పల్లె గ్రామంలోని ప్రజలు కన్నీటి పర్యంతమయ్యారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో
## అరాచక శక్తుల ఆటలు కట్టిస్తాం

**తంబళ్లపల్లె అక్టోబర్ 25 ప్రభాతవార్త :**



మండలంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అరాచక శక్తుల ఆటలు కట్టించి ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి కృషి చేస్తామని ఎస్ఐ టి అనిల్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత శుక్రవారం ఎన్నికల సందర్భంగా జరిగిన సంఘటనలో దాడులకు పాల్పడిన ప్రతి ఒక్కరిని వదిలే ప్రసక్తే లేదని తెలిపారు. ఇప్పటికే టిడిపి నాయకుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు 14 మంది నిందితులలో దాడులలో పాల్గొన్నారా లేదా అనే విషయంపై డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరా ఫుటేజ్ లు సహకారంతో వివరాలు సేకరిస్తున్నామని దాడులలో పాల్గొన్నట్లు రుజువైతే కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ప్రశాంతంగా జరగాల్సిన ఎన్నికల ప్రక్రియను దాడులు, దౌర్జన్యాలతో అడ్డుకోవాలని చూస్తే ఉపేక్షించేది లేదని ఎవరినీ వదిలే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఇప్పటికే దాడుల్లో పాల్గొన్న ఇరువురిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసి కోర్టుకు పంపామని నేరానికి పాల్పడిన వారిని గుర్తించి కేసులు నమోదు చేసి తంబళ్లపల్లెలో ప్రశాంతంగా స్థానిక సంస్థల ఎన్నికలు జరగడానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## నామినేషన్ల తిరస్కరణపై ఆర్డీవోకు అప్పీలు



ఆర్డీవో కు విజ్ఞప్తి అందజేస్తున్న దృశ్యం

**పీలేరు అక్టోబర్ 25 ప్రభాతవార్త:**

నియోజకవర్గ పరిధిలో ఎంపీటీసీ నామినేషన్ల తిరస్కరణపై 22 మంది అభ్యర్థులు ఆదివారం ఆర్డీవో కె. విజయలక్ష్మీకి అప్పీలు చేశారు. తమ వద్ద ఉన్న ఆధారాలతో ఆర్డీవోకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో వాల్మీకిపురం నుంచి 6, గుర్రంకొండ నుంచి 8 , కలకడ నుంచి 8 మంది అభ్యర్థులు అప్పీలు చేసుకున్నట్లు తెలిపారు. సంబంధిత మండలాల రిటర్నింగ్ అధికారులు అభిప్రాయం కూడా పరిగణలోకి తీసుకుని సోమవారం సాయంత్రంలోపు తుది జాబితా ప్రకటించనున్నట్లు ఆర్డీవో చెప్పారు.

## 28వ వార్డులో కౌన్సిలర్‌గా తులసీ ఏకగ్రీవం

**మదనపల్లె, అక్టోబర్ 25 ప్రభాతవార్త :**



మున్సిపాలిటి పరిధిలోని 28వ వార్డులో తెలుగుదేశం పార్టీ కౌన్సిల్ అభ్యర్థి పచ్చిపాల తులసీ రామక్రిష్ణ ఏకగ్రీవం అయ్యింది. ఈ వార్డులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరుపున ఆవుల విశ్వనాథ్, వినూతబాయిలు కౌన్సిలర్‌లుగా నామినేషన్‌లను దాఖలు చేశారు. వీరి నామినేషన్ పత్రాలు అధికారుల పరిశీలనలో తిరస్కరణకు గురయ్యాయి. దీంతో తెలుగుదేశం పార్టీ తరపున కౌన్సిలర్‌గా నామినేషన్ వేసిన పచ్చిపాల తులసీ నామినేషన్ ఏకగ్రీవం అంటూ ఎన్నికల అధికారి ఆదివారం వెల్లడించారు. ఈ వార్డులో ఇప్పటికే పచ్చిపాల తులసి మూడు పర్యాయాలు కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ఈమె భర్త పచ్చిపాల రామక్రిష్ణ విశ్వబ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్‌గా ఉంటున్నారు. ఈమె ఏకగ్రీవంపై ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, టిడిపి ఛైర్మెన్ అభ్యర్థి శ్రీరామ్ చినబాబు, టిడిపి నాయకులు అభినందించారు.

## మదనపల్లె మున్సిపల్ ఛైర్మెన్ బరిలో 9మంది

### కౌన్సిలర్ల బరిలో 130మంది

**మదనపల్లె, అక్టోబర్ 25 ప్రభాతవార్త :**

మదనపల్లె మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఛైర్మెన్ అభ్యర్థి పోటీల్లో 9 మంది ఉన్నట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. అదే విధంగా కౌన్సిలర్ల ఎన్నికల పోటీల్లో 130మంది ఉన్నట్లు అధికారులు ఆదివారం వెల్లడించారు. మున్సిపాలిటి పరిధిలో మొత్తం 48వార్డులు ఉండగా 130మంది కౌన్సిలర్ అభ్యర్థుల నామినేషన్లు ఆమోదించినట్లు తెలిపారు. ఛైర్మెన్ స్థానానికి సంబంధించి తెలుగుదేశం పార్టీ తరపున గుండ్లపల్లి శ్రీరామ్ కుమార్(చినబాబు), వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన జింకా వెంకటాచలపతి, బిఎస్‌పి తరపున బి.బాలరాజు, స్వతంత్ర్య అభ్యర్థులు కొప్పల మల్లికార్జున, గుండ్లపల్లె యోగేశ్వర్‌బాబు, టిపి.ఫీర్‌బాషా, మసక్ సలీంబాషా, శీలం రమేష్‌బాబులు బరిలో నిలిచారు.

## సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచారంపై నిఘా

### జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్

**మదనపల్లె, అక్టోబర్ 25 ప్రభాతవార్త :**



స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో ప్రచురించే పోస్టులు, ఉత్తరాలు, వీడియోలు, లఘుచిత్రాల విషయంలో ప్రత్యేక నిఘా పెట్టాలని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళికి విరుద్ధంగా, కులాలు, మతాలు, వర్గాల మధ్య విబేధాలు సృష్టించేలా, శాంతి భద్రతలకు విఘాతాలు కలిగించేలా, వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించేలా ఎలాంటి ప్రచార సామాగ్రిని రూపొందించవద్దని స్పష్టం చేశారు. ఇన్‌స్ట్రాగ్రామ్, ఫేస్‌బుక్, గ్రీటింగ్ తదితర సామాగ్రి మాధ్యమాల్లో వెలువడే ప్రచార అంశాలపై నిరంతరం నిఘా ఉంచుతాయని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల సమయాల్లో సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగేందుకు సహకరించాలన్నారు. రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థుల తరపున సామాజిక మాధ్యమాల్లో నిర్వహించే ప్రచారాలు, ప్రయోజిత ఫోస్టులు, ప్రచార ఒప్పందాల ద్వారా చేసే కార్యక్రమాలకు సంబంధించిన ఖర్చులు అభ్యర్థుల ఎన్నికల వ్యయంలోకి వస్తాయన్నారు. నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ వ్యవహరించాలన్నారు.

## భక్తిశ్రద్ధలతో పవిత్ర సమర్పణ

**వాల్మీకిపురం, అక్టోబర్ 25 ప్రభాతవార్త :**

తితిదే ఆధ్వర్యంలోని స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో శ్రీరాముడి వార్షిక పవిత్రోత్సవాలలో భాగంగా మూడోరోజు ఆదివారం పవిత్ర సమర్పణ కార్యక్రమాన్ని వేదపండితులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో అంతకు మునుపు ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమై, నిత్యసేవలు అనంతరం ఉదయం ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన మండపంలో యాగశాల వైదిక కైంకర్య కార్యక్రమాలను వేదపండితులు మంత్రాల మధ్య జరిపించారు. తదుపరి మంగళవాయిద్యాల నడుమ పవిత్రాలను వాల్మీకిక్షేత్రంలోని తిరుమాడవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారికి సమర్పించి, వైభవంగా పవిత్ర సమర్పణ కార్యక్రమాన్ని జరిపించారు. కార్యక్రమాల అనంతరం ఆలయ ప్రాంగణంలోని ఊంజల్ మండపంలో స్వామి వార్లను అధిరోహింపజేసి సుగంధ ద్రవ్య లేపనాలతో వేదపండితుల మంత్రాల మధ్య కనుల పండువగా స్నపన తిరుమంజన సేవ నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు యాగశాల కైంకర్యములను నిర్వహించారు. నేడు సోమవారం మహాపూర్ణాహుతి, కుంభప్రోక్షణ, పవిత్ర వితరణ, చక్రస్నానంతో పవిత్రోత్సవ మహోత్సవాలు ముగియనున్నాయి. కార్యక్రమంలో తితిదే డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, ఆలయాధికారులు ఉమాపతి, నాగరాజు, నగేష్, వేదపండితులు కృష్ణప్రసాద్ భట్టార్, బషికాచార్యులు, వేదపండిత భక్తులు పాల్గొన్నారు.



పవిత్రాలను తీసుకెళుతున్న ఆలయ సిబ్బంది

## సేవా కార్యక్రమాలను విస్తృతం చేద్దాం



సమావేశంలో పాల్గొన్న మానవతా సంస్థ సభ్యులు

**వాల్మీకిపురం, అక్టోబర్ 25 ప్రభాతవార్త :**

మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్కృతం చేద్దామని మానవతా సంస్థ జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక సత్యసాయి సేవా సమావేశ మందిరంలో మానవతా స్వచ్ఛాంద సంస్థ సభ్యుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశాన్ని ఉద్దేశించి కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం మానవతాసంస్థ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులు ఎక్కువగా ఉన్నారని, సంస్థచేపడుతున్న సేవా కార్యక్రమాల్లో యువతను భాగస్వామ్యం చేద్దామని పిలుపునిచ్చారు. యువతలో కూడా సేవాభావం పెంపొందే విధంగా కార్యక్రమాలను చేపడుదామన్నారు. సంస్థ ద్వారా చేపడుతున్న వైకుంఠ రథం,ఫ్రీజర్ బాక్సులు, బహిరంగ ప్రదేశాల్లో ప్రయాణికులు, ప్రజలు సేదతీరేందుకు బల్లలు ఏర్పాటు చేయడం, మొక్కలు నాటడం వంటి సేవాకార్యక్రమాలను గ్రామాల్లోని ప్రజలకు అందేవిధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రంలో సంస్థ అధ్యక్షుడు కేశవరెడ్డి, సభ్యులు ఆనంద శెట్టి, రామకృష్ణారెడ్డి, శంకర, చంద్ర, పీవీనారాయణ, సత్యనారాయణ, మురళి, రాజారెడ్డి, లక్ష్మన్న, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది పదసంచలనం

**పోరుమామిళ్ల రూరల్, అక్టోబర్ 25 ప్రభాతవార్త:**



రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న పద సంచలన కార్యక్రమాల్లో భాగంగా పోరుమామిళ్ల పట్టణంలో ఆదివారం పదసంచలనం నిర్వహించారు. స్థానిక వెంగమాంబ పాఠశాల నుంచి మలకతువ ఆంజనేయస్వామి ఆలయం వరకు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని పదసంచలనం నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ డి. మార్కా రెడ్డి, ప్రధాన వక్త చౌడూరు ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గత వంద సంవత్సరాలుగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు దేశం, ధర్మం కోసం నిరంతరం సేవలందిస్తున్నారని తెలిపారు. దేశాన్ని పరమ వైభవ స్థితికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఎన్నో సవాళ్లు, కష్టాలను ఎదుర్కొంటూ పట్టుదలతో పనిచేస్తున్నారన్నారు. దేశాభివృద్ధి, ధర్మ పరిరక్షణ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తూ, ఆర్ఎస్ఎస్ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తహశీల్దారు శివకుమార్

**పీలేరు అక్టోబర్ 25 ప్రభాతవార్త :**

తుఫాన్ ముప్పు నేపథ్యంలో పీలేరు మండల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు శివకుమార్ సూచించారు. తుఫాన్ కారణంగా ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే వెంటనే రెవెన్యూ అధికారులను సంప్రదించాలని, బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. ఆదివారం పీలేరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయాలు వెల్లడించారు. గతంలో తుఫాన్ల సమయంలో పీలేరు మండలంలో పలు ఇబ్బందులు ఎదురైనప్పటికీ, రెవెన్యూ సిబ్బంది నిరంతరం స్పందించి ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించారని గుర్తుచేశారు. ప్రస్తుతం తలెత్తనున్న ఆర్నబ్ తుఫాన్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తుఫాన్ ప్రభావంతో ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే వెంటనే స్పందించి అవసరమైన సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు సేవలందించేందుకు రెవెన్యూ యంత్రాంగం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రతి గ్రామ పరిధిలో వీఆర్వోలు, వీఆర్ఏలు, ఇతర రెవెన్యూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేసినట్లు తహశీల్దారు శివకుమార్ తెలిపారు. ప్రజలు ఆందోళన చెందకుండా అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన సహాయం కోసం అధికారులను సంప్రదించాలని కోరారు.

## టీడీపీలో చేరిన ముస్లిం కుటుంబాలు

**పులివెందుల, అక్టోబర్ 25 ప్రభాతవార్త:**

మున్సిపాలిటీ పరిధిలోని ఇస్లాంపురం 12వ వార్డులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలిందని తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు. వార్డులో బలమైన వ్యక్తిగా, అనేక కుటుంబాలతో సత్సంబంధాలు కలిగిన అన్వర్ బాషా తన స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. వీరందరికీ నియోజక వర్గ ఇన్చార్జి బీటెక్ రవి మనస్పూర్తిగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. ముస్లిం కుటుంబాల్లో అనేక మంది పిల్లలు విద్యనభ్యసిస్తున్న నేపథ్యంలో, విద్యార్థుల చదువుకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గతంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో అమలైన అమ్మఒడి పథకం కింద ఒక కుటుంబంలో ఒకరికే ఆర్థిక సాయం అందేదని, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం ద్వారా అర్హత నిబంధనలకు లోబడి చదువుకుంటున్న పిల్లలకు ఆర్థిక సాయం అందుతోందని వివరించారు. ఈ పథకం తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు దోహదపడుతుందన్నారు. పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో 12వ వార్డు నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థినీ గెలిపించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మున్సిపాలిటీలో కూటమి అభ్యర్థులకు ప్రజల నుంచి మద్దతు లభిస్తోందని నాయకులు తెలిపారు. కూటమి అభ్యర్థులు 20 మంది కౌన్సిలర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని, వారికి ధ్రువీకరణ పత్రాలు కూడా అందాయన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా పులివెందుల పట్టణంలో తాగునీరు, డ్రైనేజీ వంటి సమస్యలు కొనసాగుతున్నాయని నాయకులు విమర్శించారు. మున్సిపల్ కౌన్సిల్‌లో అధికార పార్టీకి మెజారిటీ లేని నేపథ్యంలో, పట్టణ అభివృద్ధికి కూటమి అభ్యర్థులకు కూడా అవకాశం కల్పించాలని ప్రజలను కోరారు. మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.



బిటెక్ రవి సమక్షంలో టీడీపీ లో చేరిన వైకాపా శ్రేణులు

## నడిరోడ్డులో వర్షపు నీరు-ఇబ్బందుల్లో స్థానిక ప్రజలు

**కలికిరి, అక్టోబరు 25, ప్రభాతవార్త:**

మండలంలోన పల్లఓలు పంచాయతీ గడి-గ్యారంపల్లి రోడ్డు మార్గంలోని నడిరోడ్డులో ఇటీవల కురిసిన వర్షాలకు వర్షపు నీరు పెద్ద గుంతలలో నిలిచిపోవడంతో స్థానక ప్రజలు, వాహనదారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ సమీపంలో 2 క్వారీలు ఉండడంతో పెద్ద పెద్ద వాహనాలు ఆ రోడ్డు మార్గంలో కంకర తరలించడంతో రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. దీంతో ఇటీవల కురిసిన వర్షాకు వర్షపు నీరు ఆ గుంతల్లో చేరి ఇబ్బందికరంగా మారింది. ఆ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. దీంతో ఆ నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధి అధికారులు స్పందించి ఆ వర్షపు నీరు బయటికి పోయి గుంతలకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

## ఉలవల గంగమ్మ ఆలయంలో భక్తుల సందడి



**పీలేరు అక్టోబర్ 25 ప్రభాతవార్త:**

పీలేరు మండలం, తలుపుల పంచాయతీ పరిధిలోని శ్రీశ్రీశ్రీ ఉలవల గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించడంతోపాటు తమ వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు గణేష్ రాజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మల్లయ్య నాయుడు, ప్రతాప్‌రెడ్డి, సాగర్‌రెడ్డితోపాటు బయ్యారెడ్డిగారిపల్లెకు చెందిన పలువురు భక్తులు పాల్గొన్నారు.

## 10వ వార్డు కౌన్సిలర్ ఏకగ్రీవం

**ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబర్ 25 ప్రభాతవార్త:**

మున్సిపాలిటీ శ్రీనివాస్ నగర్ పరిధిలోని 10వ వార్డులో ఏకగ్రీవంతో పండగ వాతావరణం నెలకొంది. కడప జిల్లాలోనే ఆదర్శవంతమైన నిర్ణయంగా ఈ ఏకగ్రీవం నిలిచింది. వార్డు ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి షేక్ అబ్దుల్ గఫార్‌ను కౌన్సిలర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ఆశాజనకంగా పసుపు సాగు

**దువ్వూరు, అక్టోబర్ 25, ప్రభాతవార్త:**

మండల పరిధిలో వివిధ గ్రామాల పొలాల్లో సాగుచేసిన పసుపు పంట ఆశాజనకంగా ఉంది. ఈ ఏడాది ఎల్నినో ప్రభావంతో వర్షాలు లేకపోవడంతో కేవలం గొట్టపు బావుల కింద పసుపు పంటను సాగు చేశారు. పసుపు సాగు చేసే సమయంలో మంచి ధర ఉండటంతో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయాలనే ఉద్దేశంతో విత్తనాన్ని కూడా వేశారు. అయితే ఖరీఫ్ సీజన్లో ఆశించిన మేరకు వర్షాలు రాకపోవడంతో కేవలం నీటి ఆధారంగా ఉండే ప్రాంతాల్లో మాత్రమే పసుపు పంటను సాగు చేశారు. కృష్ణంపల్లె, దువ్వూరు, మూడిళ్ల పల్లె, బయన పల్లె, ఇడమడక, గుడిపాడు తదితర ప్రాంతాల్లో సుమారు 1500 ఎకరాల్లో పసుపు పంటను సాగు చేశారు. సాగు చేసిన పంటకు సరైన వర్షాలు లేకపోవడంతో పంట సరిగా లేదు. వర్షాలు లేకపోవడంతో నీటి శాతం పెరగడంతో దుబ్బ తెగులు, ఇతర తెగుళ్ల వస్తున్నాయి. అయినా రైతులు పంటను కాపాడుకునేందుకు వివిధ రకాల ప్రయత్నాలు చేస్తూ మందులను పిచికారి చేస్తున్నారు. క్వింటాలు పసుపు ధర రికార్డు స్థాయిలో 18వేలు దాటడంతో సాగు చేసిన రైతులు పసుపు పంటపై ఆశ పెట్టుకొని ఉన్నారు. ఒక వైపు తెగుళ్ల బెడద, ఒవైపు నీటి కొరతతో కష్టాన్ని నమ్ముకొని సాగు చేస్తున్న రైతులు ధర బాగున్నందున ఆశించిన మేర లాభాలు వస్తాయని రైతులు భావిస్తున్నారు. ఇటీవల దుగ్గిరాల పసుపు మార్కెట్లో క్వింటాకు 18వేలు పలికింది. గత 20ఏళ్ల పసుపు మార్కెట్ చరిత్రలో ఎక్కువ అని రైతులు పసుపు పంటపై ఆశలు పెంచుకున్నారు.

## ఎంపీటీసీ అభ్యర్థులు బీఫారాలు అందించాలి

**రామసముద్రం, అక్టోబర్ 25 ప్రభాతవార్త**

స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరపున నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు ఈ నెల 27వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటల్లోగా బీఫారాలు అందించాలని ఎంపీడీవో లతీఫ్ ఖాన్ తెలిపారు. పార్టీ అధ్యక్షుల సంతకాలతో జారీ చేసిన బీఫారాలను సంబంధిత రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలన్నారు. నిర్ణీత గడువులోగా అందించకపోతే అభ్యర్థులను స్వతంత్రులుగా పరిగణించి ఎన్నికల గుర్తులు కేటాయిస్తామని స్పష్టం చేశారు.

## రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడు మృతి

**పీలేరు అక్టోబర్ 25 ప్రభాతవార్త:**

పీలేరు మదనపల్లి మార్గంలోని రైల్వే బ్రిడ్జి సమీపంలో ఆదివారం సాయంత్రం విషాద ఘటన చోటుచేసుకుంది. నాగర్‌కోయిల్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

# కూటమి ప్రభుత్వంతో ప్రొద్దుటూరుకు మహర్దశ

**ప్రొద్దుటూరు అర్బన్,అక్టోబర్ 25, ప్రభాతవార్త**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రొద్దుటూరు అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకొచ్చి పట్టణ రూపురేఖలు మారుస్తామని జమ్మలమడుగు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఎస్.కె.ఎస్.సి. డిగ్రీ కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, ఇప్పటికే రూ.45 కోట్ల హామ్ నిధులు వచ్చాయని, మరిన్ని నిధులు రానున్నాయని తెలిపారు. వైసీపీ నేత రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి విమర్శలకు స్పందిస్తూ, రాజకీయాల్లో అసత్య ఆరోపణలు చేయడం, వ్యక్తిగత విమర్శలకు దిగడం సరికాదన్నారు. వైసీపీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి పోరెడ్డి నరసింహ రెడ్డి సంతకం లేకుండా నామినేషన్ ఎలా దాఖలు చేశారని ప్రశ్నించారు. పులివెందులలోనూ పలు కౌన్సిలర్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయని, గతంలో ఏకగ్రీవాలపై విమర్శలు చేసిన వైసీపీ నేతలు దీనిపై సమాధానం చెప్పాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీలు, టిడ్కో ఇళ్ల విషయంలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కొప్పర్తికి అదనపు నిధులు సమకూర్చడంతో పాటు రాయలసీమలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆదినారాయణరెడ్డి తెలిపారు. జిల్లాలో స్టీల్ ప్లాంట్, జమ్మలమడుగులో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళల సంక్షేమానికి, యువతకు అవకాశాల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 2029 ఎన్నికల్లో అభివృద్ధిని చూపించి ప్రజల మద్దతు కోరుతామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి ముక్తియార్, టీడీపీ యువ నాయకుడు నంద్యాల కొండారెడ్డి, ఈవీ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపాలిటీలో 39 వార్డులో ఏకగ్రీవం

**బద్వేలు, అక్టోబర్ 25,ప్రభాతవార్త:**

మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా బద్వేలు మున్సిపాలిటీ నామినేషన్లు, స్క్రూటిని ఉపసంహరణ అంశాలు పూర్తి అయిన తర్వాత బద్వేలు మున్సిపాలిటీ పూర్తిస్థాయిలో టీడీపీ కైవసం అయింది. ఇందులో 39 వార్డులు ఏకగ్రీవంకాగా, 35 వార్డులు అధికార టీడీపీ కైవసం చేసుకోగా, అలాగే కూటమిలో భాగస్వామి అయిన జనసేనకు 2 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. మరో 2 స్థానాలు స్వతంత్ర అభ్యర్థులు గెలుచుకున్నారు. దీంతో మున్సిపాలిటీలోని 40 స్థానాలకు గాను 39 స్థానాలు కూటమి కైవసం చేసుకోగా ఒక్కస్థానానికి నవంబర్ 1న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఎన్నికల అధికారులు ఏకగ్రీవంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్తో పాటు 39 మంది కౌన్సిలర్లకు డిక్లరేషన్ ఫారాలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ శాసనసభ్యులు పుతా నరసింహారెడ్డి, ముఖ్య అతిగా, మరియు టీడీపీ ఇన్చార్జి సూర్యనారాయణరెడ్డి హాజరై డిక్లరేషన్ ఫారాలు అందించారు.




## సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**సుండుపల్లె,అక్టోబర్ 25,ప్రభాతవార్త :**

మానవతా సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తరించి, సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ సంస్థ మండల అధ్యక్షుడు మహబూబ్ బాషా పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ సమాజంలో సేవాభావాన్ని పెంపొందిస్తూ, అవసరంలో ఉన్న వారికి అండగా నిలవడం ద్వారా మానవతా విలువలను చాటాలని సూచించారు. రానున్న రోజుల్లో మండల వ్యాప్తంగా వివిధ సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. సంస్థ అభివృద్ధికి సభ్యుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమన్నారు. సమాజంలో ఐక్యత, సహకారం, సేవాభావాన్ని పెంపొందిస్తూ ప్రజలకు మరింత చేరువ కావడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. సంస్థను బలోపేతం చేసి, సేవా కార్యక్రమాల ద్వారా సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ సభ్యులు హరికుమార్, అమృనాయక్, శంకర్ నాయక్ వీఆర్వోలు బసయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

